# మంత్రులు, ఎమ్మెల్యేలకు ఇరిగేషన్ ప్రాజెక్టులపై కనీస అవగాహన లేదు

- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్
- గాయత్రి పంప్‌హౌస్‌ను సందర్శించిన బీఆర్ఎస్ నాయకులు




**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** మంత్రులు అడ్లూరి లక్ష్మణ్, ఉత్తమ్ కుమార్ రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టుపై అసందర్భ వ్యాఖ్యలు చేయడం విచారకరం. కనీస అవగాహన లేనట్లుగా, ఎల్లంపల్లి నుండి మిడ్ మానేరు వరకు గ్రావిటీ ద్వారా నీళ్లు వస్తాయని, అలాగే ప్రాణహిత నుండి ఎల్లంపల్లి వరకు కూడా గ్రావిటీ ద్వారానే నీళ్లు వస్తాయని వ్యాఖ్యానించడం సరైనది కాదు. కాళేశ్వరం ప్రాజెక్టు అనేది ఒక సమీకృత (ఇంటిగ్రేటెడ్) ప్రాజెక్టు. కాళేశ్వరం అంటే కేవలం మేడిగడ్డ బ్యారేజీ మాత్రమే అనే భావనతో మాట్లాడడం అవగాహన రాహిత్యానికి నిదర్శనం. అందుకే కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రజలకు సరైన అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. గ్రావిటీ, కాళేశ్వరం ప్రాజెక్టులపై సరైన అవగాహన లేకుండా కాంగ్రెస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ఆరోపించారు. పాదయాత్రలు, పూజలు చేస్తే పంపులు ఆన్ కావని, ప్రాజెక్టుల నిర్వహణపై దృష్టి పెట్టాలని సూచించారు. రామడుగు మండలం లక్ష్మీపూర్ గ్రామంలోని గాయత్రి పంప్‌హౌస్‌ను ఆదివారం బీఆర్ఎస్ ముఖ్య నాయకుల బృందం సందర్శించింది. అనంతరం పంప్‌హౌస్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై పలు విమర్శలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎల్. రమణ, చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేయడంలో కాళేశ్వరం ప్రాజెక్టు కీలక పాత్ర పోషించిందన్నారు. ప్రాజెక్టుపై క్షేత్రస్థాయి అవగాహన లేకుండా విమర్శలు చేయడం సరికాదని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం పనిచేయాలని అన్నారు. మాజీ ఎంపీ వినోద్ కుమార్ మాట్లాడుతూ.. అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు ఎల్లంపల్లి ప్రాజెక్టుకు ప్రధాన నీటి ఆధారాలని తెలిపారు. మేడిగడ్డ వద్ద వృథాగా సముద్రంలో కలిసే వరద జలాలను కాళేశ్వరం ద్వారా వినియోగించుకునేలా ప్రణాళిక రూపొందించామని చెప్పారు. రాజకీయ విమర్శల కంటే తెలంగాణ నీటి ప్రయోజనాలే ముఖ్యమని పేర్కొన్నారు.

కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. గ్రావిటీతోనే నీరు వస్తుందని చెబుతున్న కాంగ్రెస్ నాయకులు కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ పంపులు ఎందుకు ఏర్పాటు చేశారో చెప్పాలని ప్రశ్నించారు. మేడిగడ్డ నుంచి గాయత్రి పంప్‌హౌస్ వరకు నీటిని తరలించేందుకు ఎత్తిపోతల అవసరం ఉందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీరింగ్ అద్భుతమని, దానిపై అవగాహన లేకుండా మాట్లాడటం సరికాదన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎల్. రమణ మాట్లాడుతూ.. కేసీఆర్ నాయకత్వంలో సాగునీటి రంగంలో అనేక మార్పులు వచ్చాయని అన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం రైతుల సమస్యలను పక్కన పెట్టవద్దని సూచించారు. పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి మాట్లాడుతూ.. పంట పొలాలకు సకాలంలో నీరు అందించడంలో ప్రస్తుత ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. నీటి ప్రాజెక్టుల నిర్వహణపై ప్రభుత్వం మరింత శ్రద్ధ చూపాలని డిమాండ్ చేశారు. చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ మాట్లాడుతూ.. గ్రావిటీపై కనీస అవగాహన లేకుండా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నారని విమర్శించారు. పాదయాత్రలు, పూజలతో పంపులు పనిచేయవని, ప్రాజెక్టుల నిర్వహణకు సాంకేతిక పరిజ్ఞానం అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం నివాసంలో.. వైభవంగా బోనాల వేడుకలు

**బోనాల విందులో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ప్రజాప్రతినిధులు**

**విశ్వంభర, హుస్నాబాద్ :** సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికార నివాసంలో ఆదివారం సంప్రదాయబద్ధంగా బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఏర్పాటు చేసిన బోనాల విందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కొండా సురేఖ, వివేక్ వెంకటస్వామి, వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఉన్నతాధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.బోనాల ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన విందులో మంత్రి పొన్నం ప్రభాకర్ అతిథులను ఆప్యాయంగా ఆహ్వానించి, తెలంగాణ సంప్రదాయ వంటకాలతో ప్రత్యేకంగా విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అతిథులతో స్నేహపూర్వకంగా ముచ్చటిస్తూ వారికి స్వయంగా ఆతిథ్యం అందించారు.అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి పొన్నం ప్రభాకర్ తల్లి మల్లమ్మ, సతీమణి మంజుల, కుమారులు పృథ్వీ, ప్రణవ్ ,వారి సోదరులు వారి కుటుంబ సభ్యులు, బంధువులతో ఆప్యాయంగా మాట్లాడారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటూ కుటుంబ సభ్యులను పలకరించారు. ఈ ఆత్మీయ వాతావరణం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.బోనాల ఉత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం భక్తి, సంప్రదాయం, ఆతిథ్యానికి ప్రతీకగా నిలవడంతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకువచ్చిన ఆత్మీయ సమావేశంగా నిలిచింది.





## డాక్టర్స్ కాలనీలో మొక్కల పంపిణీ




**విశ్వంభర, సరూర్ నగర్ :** డాక్టర్స్ కాలనీలో పచ్చదనాన్ని పెంచేందుకు మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కాలనీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్ రావు తెలిపారు. ఆదివారం వివేకానంద పార్క్ లో మొక్కల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ "ప్రతి ఇంటివారు కాంపౌండ్ వాల్ దగ్గర చెట్ల కోసం ప్రత్యేకంగా కట్టిన ట్రీ బాక్స్ లలో తప్పనిసరిగా మొక్కలు ఏర్పాటు చేయాలి. పచ్చదనం కోసం ప్రతి కాలనీలో ఇలాంటి చెట్లు నాటే కార్యక్రమాలు చేపట్టాలి" అని ఆయన పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా కాలనీ వాసులందరూ కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమామహేశ్వర రావు, నరేష్, కబీర్ దాస్, ధనుంజయ, శేకర్ రెడ్డి, హార్టికల్చర్ ఇంచార్జి ప్రవీణ్, సులోచన, మహిళా అధ్యక్షురాలు కల్వకుంట్ల మమత, కార్యదర్శి తోడేటి సరిత, సంధ్య తో పాటు పలువురు మహిళలు మరియు కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలను పంపిణీ చేశారు.



తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం చైర్మన్ డా. కాచం సత్యనారాయణ చేతుల మీదుగా ప్రశంస పత్రాలను ఉద్యమకారులు ఆదివారం చైతన్యపురిలోని ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యాలయంలో అందుకున్నారు. (విశ్వంభర, చైతన్యపురి)

# ఘనంగా ఉజ్జయిని బోనాల జాతర



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి బోనాల జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. అమ్మవారికి తెల్లవారుజామునే మహా మంగళ హారతి ఇచ్చారు. మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్రం ప్రభుత్వం తరపున బంగారు బోనం, పట్టు వస్త్రాలు సమర్పించారు. పలువురు ప్రముఖులు అమ్మవారికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. యువతులు, మహిళలు బోనాలతో, శివసత్తుల నృత్యాలతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.









## సాధన దీక్షను విజయవంతం చేద్దాం

**- వ్యవస్థాపక అధ్యక్షులు కాచం సత్యనారాయణ గుప్త**



**విశ్వంభర, చైతన్యపురి :** ఈ నెల 3 వ తేదీన సోమవారం హైదరాబాదులోని ఇందిరా పార్క్ (ధర్నా చౌక్) వద్ద వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే వైశ్య కార్పోరేషన్ నిధులకై "సాధన దీక్ష"ను విజయవంతం చేద్దాం అని వైశ్య వికాస వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు లయన్ డా. కాచం సత్యనారాయణ గుప్త పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. కార్పొరేషన్ ఏర్పాటుతో వైశ్యులందరు ఎంతో సంతోషించారని, కానీ ఈ రెండేళ్ల కాలంలో కార్పొరేషన్ కు నిధులు ఇవ్వకుండా కాలయాపన చేయడం జరిగిందన్నారు. మన హక్కుల కోసం కలిసి పోరాటం చేసి ప్రభుత్వం నుండి నిధులు రాబట్టుకుందామని అన్నారు. వైశ్యుల అభివృద్ధి లక్ష్యంగా పనిచేసే వైశ్య వికాస వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే సాధన దీక్షకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.


**2వ అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్–2026లో**

## ప్రతిభ చాటిన యుక్తి మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులు



**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్‌లో నిర్వహించిన 2వ అంతర్జాతీయ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్‌షిప్-2026లో ఉప్పల్ భాగాయత్‌కు చెందిన యుక్తి మార్షల్ ఆర్ట్స్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అకాడమీకి మంచి పేరు తీసుకువచ్చారు. సెన్సై రామ ఫణీంద్ర అక్కలదేవి శిక్షణలో విద్యార్థులు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, పోరాట స్ఫూర్తితో పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటారు. ఈ పోటీలు విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయి అనుభవాన్ని అందించడంతో పాటు భవిష్యత్ పోటీలకు మరింత ప్రేరణగా నిలిచాయి. ఈ సందర్భంగా సెన్సై రామ ఫణీంద్ర అక్కలదేవి మాట్లాడుతూ..., "విజయం కంటే ప్రతి పోటీ ఒక గొప్ప నేర్చుకునే అవకాశం. ధైర్యంగా బరిలోకి దిగి క్రమశిక్షణతో తమ అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన ప్రతి విద్యార్థి నిజమైన విజేతే. విద్యార్థులకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తున్న తల్లిదండ్రులకు నా హృదయపూర్వక ధన్యవాదాలు." అని తెలిపారు. యుక్తి మార్షల్ ఆర్ట్స్ సంస్థ శారీరక దృఢత్వం, మానసిక ధైర్యం, క్రమశిక్షణ కలిగిన విద్యార్థులను తీర్చిదిద్దే లక్ష్యంతో పనిచేస్తూ, భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ విజయాలను సాధించేందుకు కృషి చేస్తుందని తెలిపారు.

## పింగళి వెంకయ్యకు భారతరత్న ఇవ్వాలి




**విశ్వంభర, ముషీరాబాదు :** జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య సేవలకు గుర్తింపుగా భారతరత్న పురస్కారం ప్రకటించాలని పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోడూరు శ్రీదేవి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. పింగళి వెంకయ్య చారిటబుల్ ట్రస్ట్, స్మారక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాదు అడిక్మెట్ లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో పింగళి వెంకయ్య 148వ జయంతి వేడుకలు నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ కోడూరు శ్రీదేవి, సంస్థ చైర్‌పర్సన్ కోడూరు శ్యామలరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పింగళి వెంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోడూరు శ్రీదేవి మాట్లాడుతూ, భారత జాతీయ పతాక రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన పింగళి వెంకయ్య సేవలను దేశం చిరస్థాయిగా గుర్తుంచుకోవాలని అన్నారు. ఆయనకు భారతరత్న పురస్కారం ప్రకటించడం ద్వారా తగిన గౌరవం దక్కుతుందని పేర్కొన్నారు. సంస్థ ఆహ్వానం మేరకు జి.ఎన్. కేశవ్ జయంతి కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్‌పర్సన్ కోడూరు శ్యామలరావు, జనరల్ సెక్రటరీ బంగారు ప్రశాంత్, సెక్రటరీ సుధాకర్ రెడ్డి, బీజేపీ నాయకుడు శేషసాయి, మేడి సత్యనారాయణ, కరణం సురేష్, విజయ్ యాదవ్, కిరణ్, పాలగంటి లక్ష్మణ్, కర్ర వెంకటేష్, టీఆర్ఎస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కళలు వ్యక్తిత్వ వికాసానికి దోహదం




**విశ్వంభర, చిక్కడపల్లి :** సంగీతం, నాట్యం వంటి కళలు ఆత్మవిశ్వాసాన్ని పెంచి జీవితంలో అభివృద్ధికి దోహదపడతాయని ప్రముఖ దర్శకుడు తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రాజన్ సప్తస్వరాలు మ్యూజిక్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాదు చిక్కడపల్లి త్యాగరాయ గానసభలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ నమోదు కోసం 12 గంటలపాటు నిర్విరామ సంగీత, నృత్య ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో తమ్మారెడ్డి భరద్వాజ మాట్లాడుతూ కళలు మనిషిలో క్రమశిక్షణ, సృజనాత్మకతను పెంపొందిస్తాయని అన్నారు. సంగీతం, నాట్యం అంటే కేవలం సినీ వినోదం కాదని, భారతీయ సంస్కృతికి ప్రతీకలైన కళలను యువత అభ్యసించాలని సూచించారు. అనవసర వ్యామోహాలకు దూరంగా ఉండి కళలు, సాహిత్యంపై ఆసక్తి పెంచుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తొమ్మిది మంది నాట్య గురువుల శిష్యబృందాలు జానపద, శాస్త్రీయ నృత్యాలు ప్రదర్శించగా, అక్షయవల్లి శిష్యబృందం లలిత గీతాలు ఆలపించింది. సంగమేశ్వరరావు బృందం అన్నమయ్య నాటకాన్ని ప్రదర్శించింది. అనంతరం తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి అశోక్ కుమార్ సంస్థ స్థాపకుడు రాజన్‌కు రికార్డు నమోదు ధ్రువపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం నాయకురాలు యామిని, దైవజ్ఞ శర్మ, వంశీ ప్రతాప్, ఎన్నం శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శి రోహిణి, సీతారామయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## బైరామల్‌గూడ చెరువులో విషాదం



**విశ్వంభర, ఎల్బీనగర్ :** బైరామల్ గూడ చెరువులో విషాదం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రంగారెడ్డి జిల్లా, ఇంజాపూర్‌కు చెందిన లోకసాని రాజేశ్వరి ( 34 )వృత్తి: గృహిణి, స్వస్థలం కర్ణాటక రాష్ట్రం, బీదర్ జిల్లా. రాజేశ్వరి తన 9 నెలల కూతురు లోకసాని అనురాధను బైరామల్‌గూడ చెరువులో ముంచి చంపింది. దీంతో ఆ చిన్నారి అక్కడికక్కడే మృతి చెందింది. ఘటన సమయంలో నిందితురాలు మద్యం మత్తులో ఉన్నట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా జనరల్ ఆస్పత్రికి తరలించారు. నిందితురాలు రాజేశ్వరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.